## కక్షసాధింపు చర్యే

**బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు**

జగిత్యాల, మే 21 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మంచి పాలన అందించారని, రాష్ట్రాన్ని సుభిక్షంగా మార్చారని బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు కొనియాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణను సస్యశ్యామలం చేశారని గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలతో కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చిందని మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంతో ఎండకాలంలోనూ నీళ్లిచ్చిన ఘనత కేసీఆర్‌దేనని ప్రశంసించారు. పంటలకు నీళ్లందించక ఎండబెట్టి రైతులను గోసబెట్టిన ఘనత కాంగ్రెస్‌దేనని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం చేస్తున్న పనులలతో ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను పోగొట్టుకోవడానికి, అలాగే కేసీఆర్, బీఆర్ఎస్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక నోటీసులు ఇచ్చారని మండిపడ్డారు. గడిచిన పదిహేను నెలల కాలంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఎన్ని నోటీసులు ఇచ్చిన న్యాయపరంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.



## కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్

మాట్లాడుతున్న నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

- కేసీఆర్‌ను దోషిగా చిత్రీకరించే కుట్ర
- నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

సిరిసిల్ల టౌన్, మే 21: ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను తప్పించుకునేందుకే కాంగ్రెస్ సర్కారు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపిందని నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ధ్వజమెత్తారు. పాలన చేతగాకే కేసీఆర్‌ను బద్నాం చేసే దిశగా కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో కమీషన్ల పాలన నడుస్తున్నదని సొంత పార్టీ నాయకులు, మంత్రులే స్వయంగా చెబుతున్నారని విమర్శించారు. సిరిసిల్లలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పదిహేడు నెలల పాలనలో ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో అమలు చేయలేదని, అంతా కమీషన్ల పంపిణీపై ప్రభుత్వ పాలన నడుస్తున్నదని ఆరోపించారు. డైవర్షన్ రాజకీయాల్లో భాగంగానే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు నాడు ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు, ఆర్థికశాఖ మంత్రిగా పని చేసిన ఈటల రాజేందర్‌కు నోటీసులు ఇచ్చిందని తెలిపారు. ప్రభుత్వం విచారణ చేయడంలో తప్పు లేదని, ఓ పత్రిక వార్తా ఆధారంగా దోషులుగా చిత్రీకరించాలనే ఉద్దేశ్యంతోనే నోటీసులు జారీ చేశారని తాము భావిస్తున్నామన్నారు. కాంట్రాక్టర్లు కమీషన్లు ఇవ్వలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, ఇటీవల స్వయానా ఓ మంత్రి అందరు మంత్రులు డబ్బులు తీసుకుంటున్నారని చెప్పిన విషయం ద్వారానే ప్రభుత్వ పని తీరు అర్థమవుతుందన్నారు. సాధించుకున్న రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా కేసీఆర్ పని చేశారని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తెలంగాణను సస్యశ్యామలం చేశారని కొనియాడారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌ను దోషిగా చూపాలన్న దురుద్దేశంతోనే పని చేస్తున్నదని మండిపడ్డారు. న్యాయ వ్యవస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందని, కోర్టు తీర్పును తాము గౌరవిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, తంగళ్లపల్లి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, మాజీ కౌన్సిలర్ గుండ్లపల్లి పూర్ణచందర్, సెస్ మాజీ డైరెక్టర్ కుంబాల మల్లారెడ్డి, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### బద్నాం చేసేందుకే..

కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు వచ్చినా ప్రజలకు కష్టాలు వస్తాయని నానుడి ఉన్నది. ప్రస్తుత పరిస్థితులను చూస్తే ఇది అక్షరాలా నిజమే అనిపిస్తుంది. రేవంత్‌రెడ్డి అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిండు. ఏ ఒక్క హామీనీ పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదు. వృద్ధులు, వితంతువులు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నరు. ప్రజల దృష్టిని మరల్చే విధంగా కాళేశ్వరం కమిషన్ పేరు మీద కేసీఆర్‌కు నోటీసులు పంపిన్రు. ఇది రాజకీయ కక్షే. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నం. కేసీఆర్ తెలంగాణ సాధించడం వల్లే ఈ రోజు రేవంత్‌రెడ్డి సీఎం అయిండు. ఈ విషయాన్ని ఆయన గుర్తుంచుకోవాలి. లేకపోతే ఆంధ్రోళ్ల సంచులు మోసుకుంటూ ఉండెటోడు. కేసీఆర్ కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా పంప్‌హౌస్‌లు, అప్పర్‌మానేరు, మల్లన్నసాగర్, కొండపోచమ్మ, రంగనాయకసాగర్ ప్రాజెక్టులు నిర్మించిండు. తెలంగాణను సస్యశ్యామలం చేసిండు. కానీ, మేడిగడ్డ ప్రాజెక్టులో ఒక్క పిల్లర్ కుంగితే మొత్తం నిర్మాణమే లోపభూయిష్టంగా ఉందని కేసీఆర్‌ను బద్నాం చేస్తున్నరు. ప్రభుత్వం వేసిన కమిషన్ నుంచి కేసీఆర్ కడిగిన ముత్యంలా బయటికి వస్తరు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అరాచక పాలనను ప్రజలు తిరస్కరిస్తరు.

**- తోట ఆగయ్య, బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు**



# రాజకీయ కక్షతోనే కేసీఆర్‌పై కుట్రలు

**వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కాళేశ్వరం కమిషన్ నోటీసులు**



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

- పథకం ప్రకారమే ప్రాజెక్టుపై దాడి
- గోదావరి జలాలు తరలించేందుకే కుట్ర
- చంద్రబాబు మెప్పు కోసం తెలంగాణకు రేవంత్ ద్రోహం
- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్, మే 21: ప్రజలు కేసీఆర్ పాలనను గుర్తు చేసుకోవడం చూసి కాంగ్రెస్ ప్రభుత్వం ఓర్వలేక పోతున్నదని, రాజకీయ కక్షతోనే నోటీసులు ఇచ్చిందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేక, పరిపాలన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు రేవంత్‌రెడ్డి కాళేశ్వరం కమిషన్ నోటీసుల కుట్రకు తెరలేపాడని దుయ్యబట్టారు. గోదావరి జలాలను ఆంధ్రప్రదేశ్‌లోని ధవళేశ్వరం ప్రాజెక్టుకు తరలించడానికి కుట్ర జరుగుతున్నదని, అందుకే పథకం ప్రకారం కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ప్రభుత్వం దాడిచేస్తున్నదని విమర్శించారు. మానకొండూర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రసమయి మాట్లాడారు. కేసీఆర్‌ను రేవంత్ సర్కార్ ఎందుకు వేధిస్తున్నదో చెప్పాలని ప్రశ్నించారు. ప్రాణాలు పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించినందుకా..? కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి కోటి ఎకరాలకు సాగునీరిచ్చినందుకా..? రైతు బంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్‌తో రైతును రాజును చేసినందుకా..? మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచినీళ్లు ఇచ్చినందుకా..? అని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో మానకొండూర్ నియోజకవర్గంలో మూడు పంటలు పండించారని గుర్తు చేశారు. చంద్రబాబు మెప్పు కోసం రేవంత్‌రెడ్డి తెలంగాణకు ద్రోహం చేస్తున్నాడని మండిపడ్డారు. నీటితో కళకళలాడాల్సిన కాళేశ్వరాన్ని ఎండబెట్టి ఇసుకను తోడేస్తున్నారని ధ్వజమెత్తారు. ధాన్యం కొనుగోళ్లు ఇప్పటి వరకు 40 శాతం కూడా జరగలేదని, కేంద్రాల్లో వడ్ల కుప్పలు వానకు తడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులకు రైతుల కష్టాలు పట్టించుకోవడానికి క్షణం తీరిక లేదని, కానీ హైదరాబాద్‌లో జరుగుతున్న అందాల భామల పోటీలపై మక్కువ చూపుతున్నారని చురకలంటించారు. మానకొండూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి ప్రత్యేక చొరవ తీసుకుని రెండు, మూడు రోజుల్లో వడ్ల కొనుగోళ్లు పూర్తి చేయాలని, లేని పక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్ గౌడ్, శంకరపట్నం జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, నాయకులు ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, వీరాస్వామి, శాతరాజు యాదగిరి, బోడ రాజశేఖర్, రాజుయాదవ్, నెల్లి శంకర్, సందీప్, అనిల్ పాల్గొన్నారు.

### ప్రజల దృష్టిని మళ్లించేందుకే..

**మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి**

కథలాపూర్, మే 21 : సర్కారు చేతగాని తనం, పాలనా వైఫల్యాలన్ని కప్పిపుచ్చుకునేందుకు నోటీసుల పేరిట డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి మండిపడ్డారు. కాళేశ్వరం కమిషన్ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌పై కుట్రలకు తెరలేపిందని, ఇలాంటి చర్యలకు పాల్పడడం సిగ్గు చేటని ఎద్దేవా చేశారు. వ్యవసాయాన్ని పండుగ చేసిన నేత కేసీఆర్ అని కొనియాడారు. కాంగ్రెస్ కుట్రలను తెలంగాణ సమాజం నమ్మదని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విచారణ పేరిట నోటీసులు ఇవ్వడం సిగ్గు చేటని, ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇలా కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. అయినా ఇదంతా కక్షసాధింపు చర్యల్లో భాగమేనని చెప్పారు. తెలంగాణ ప్రజలు మరోసారి మర్లబడడం ఖాయమన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణను అన్ని రంగాల్లో ముందుంచారని, రాష్ట్ర కీర్తిని విశ్వవ్యాప్తం చేశారని ప్రశంసించారు. ప్రజలు కేసీఆర్‌తో ఉంటారని, ఆయనను అడ్డుకోవాలన్న ప్రతి ప్రయత్నాన్ని చివరికి ప్రజలే తిప్పికొడతారని హెచ్చరించారు.

## ఆస్తుల విచారణకు సిద్ధమే

- అడ్లూరి.. నీ ఆస్తుల సంగతి తేలాల్సిందే
- ఏడాదిన్నర కాలంలో ఏం అభివృద్ధి చేసినవ్
- సమాధానం చెప్పకుండా అనుచిత వ్యాఖ్యలా?
- ప్రభుత్వ విప్ ఆరోపణలపై మాజీ మంత్రి కొప్పుల నిప్పులు
- అసత్య ఆరోపణలతో అభివృద్ధి జరగదని హితవు
- ధర్మారం బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ దాడిపై ఖండన

ధర్మారం, మే 21 : తన ఆస్తులపై విచారణకు సిద్ధమని, అవసరమైతే ముఖ్యమంత్రి విచారణ జరిపించినా తనకు అభ్యంతరం లేదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. అలాగే విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆస్తుల సంగతి తేలాల్సిందేనన్నారు. ఏడాదిన్నర కాలంలో నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశారో సమాధానం చెప్పాల్సింది పోయి, ప్రజలను పక్కదారి పట్టించడానికి తనపై వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేయడమేంటని మండిపడ్డారు. ప్రజా జీవితంలో గొప్పగా ఉండే ప్రయత్నం చేయాలని, ఈ చిల్లర మాటలు మానుకోవాలని హితవు పలికారు. అసత్య ఆరోపణలతో అభివృద్ధి జరగదని చెప్పారు. అభివృద్ధిపై ధర్మారంలో మంగళవారం జరిగిన చర్చా వేదికలో సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేస్తే దౌర్జన్యంగా దాడి చేయించడాన్ని ఖండించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అభివృద్ధిపై సమాధానం చెప్పే ధైర్యం లేక మంగళవారం ధర్మారంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ ప్రెస్‌మీట్ పెట్టి తనపై నిరాధారమైన ఆరోపణలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను అనేక మందిని ఆదుకున్నది, ప్రాణాలు కాపాడిన విషయాలపై లక్ష్మణ్ కుమార్‌కు అవగాహన లేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలు చేపట్టడమే ప్రధాన పనిగా ఆయన పెట్టుకున్నాడని, అభివృద్ధిపై ప్రశ్నిస్తే వారిపైన దాడులు చేయించడం, లేదంటే పోలీసులతో అక్రమ కేసులు పెట్టించడం లక్ష్మణ్‌కుమార్ ఘనకార్యమని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే నియోజకవర్గంలోని ఆరు సొసైటీలపై ఫిర్యాదు చేస్తే కోర్టు విచారణ జరిపి ఎలాంటి అవకతవకలూ జరుగలేదని మొట్టికాయలు వేసిందని, అయినా బుద్ధి రాలేదన్నారు. వెల్గటూర్ మండలం చెగ్యాంతో పాటు ఇతర మండలాల్లో కొంతమంది ఎస్సీ, బీసీలు గతం నుంచి సాగు చేస్తున్న ప్రభుత్వ భూములకు పట్టా సర్టిఫికెట్లు ఇవ్వాలని తాను ప్రతిపాదిస్తే వాటిని రద్దు చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి నష్టం కలిగించాడని ఈశ్వర్ ఆరోపించారు. ధర్మపురిలో ట్రాక్టర్ వాళ్లు బీఆర్ఎస్‌కు మద్దతిస్తే ఆరు నెలలు ట్రాక్టర్లు నడవకుండా చేసి వాళ్ల కడుపు కొట్టింది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. పదవిలో ఉన్నానని లక్ష్మణ్ కుమార్ ఇష్టారాజ్యంగా మాట్లాడితే సహించేది లేదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో గజం రూ.లక్ష విలువ ఉన్న భూమి వెయ్యి గజాలు ఎలా వచ్చిందని, కరీంనగర్‌లో కొత్త ఇల్లు ఎలా కడుతున్నావని, హైదరాబాద్‌లో విల్లా ఎలా కొన్నావని నిలదీశారు. నియోజకవర్గంలోని ఏ గ్రామంలోనైనా తాను ఏ విధంగా అభివృద్ధి చేశానో ప్రజలందరికీ తెలుసునని అన్నారు. ఎప్పటికైనా న్యాయం ధర్మమే గెలుస్తుందని చెప్పారు.



కోనరావుపేట: నిజామాబాద్‌లో తడిసిన వడ్లను ఎత్తుతున్న మహిళా రైతు



మారుతీనగర్: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో అకాల వర్షానికి వడ్ల కుప్పల చుట్టూ చేరిన నీరు



మారుతీనగర్: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో వర్షానికి తడిసి ధాన్యాన్ని కుప్పపోస్తున్న రైతు



గంభీరావుపేట: కొత్తపల్లి కొనుగోలు కేంద్రంలోని వరద నీటిలో వడ్ల కుప్పలు



కోల్‌సిటీ: రోడ్డుపై ప్రవహిస్తున్న వరదలో వాహనదారులు

## రెక్కల కష్టం నీళ్లపాలు

- అకాల వర్షంతో కేంద్రాల్లో తడిసిన వడ్లు
- కంటతడి పెట్టిన రైతులు

రాజన్న సిరిసిల్ల, మే 21 (నమస్తే తెలంగాణ) : రైతన్న ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం వర్షార్పణమైంది. అధికారుల నిర్లక్ష్యం శాపంలా మారి కొనుగోలు కేంద్రాల్లో తడిసిపోయింది. బుధవారం తెల్లవారు జామున, సాయంత్రం పడిన వర్షానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలుచోట్ల ధాన్యం తడిసి ముద్దయింది. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబోసుకున్న వడ్ల కుప్పలపై ప్లాస్టిక్ కవర్లు కప్పినప్పటికీ గాలి దుమారానికి లేచిపోయి వర్షానికి ధాన్యం కొట్టుకుపోయింది. దీంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం వన్‌పల్లి, ఇల్లంతకుంట మండలం పొత్తూరు, ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, కోనరావుపేట మండలంలోని నిజామాబాద్, రుద్రంగి మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ధాన్యం కుప్పలు తడిశాయి. పెద్దపల్లి జిల్లా మంథని, గోదావరిఖనిలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పిడుగుల మోత ప్రజలను భయకంపితులను చేసింది. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో పోసిన వరిధాన్యం పూర్తిగా తడిసిపోయింది. సారంగాపూర్, బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఉదయం, సాయంత్రం ఈదురు గాలులు, ఉరుముల శబ్దంతో వర్షం కురిసింది. కరీంనగర్ జిల్లా గంగాధర, తిమ్మాపూర్ మండలకేంద్రాలతోపాటు పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. గంగాధరకు వెళ్లే దారిలో రోడ్డుకు అడ్డుగా చెట్టు కూలిపోవడంతో తాజా మాజీ సర్పంచ్ మడ్లపెల్లి గంగాధర్ స్థానికుల సహకారంతో తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు.



### ఇరువై రోజులైనా సంచులిస్తలేరు

నాది వెల్లుల్ల అనుబంధ గ్రామం మాసాయిపేట్. నాకు రెండున్నర ఎకరాల పొలం ఉన్నది. నేను పండించిన ధాన్యాన్ని ఇరువై రోజుల క్రితం మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌కి తెచ్చిన. అడిగి ప్రతిసారి రేపు రా సంచులిస్తం.. కాంటా వేస్తం అన్నరు. కానీ, సంచులిస్తలేరు. కాంటా వేస్తలేరు. అసలు కొంటరా..? లేదా..? అని అధికారులను అడిగితే నిర్లక్ష్యంగా జవాబిస్తున్నరు. మబ్బులు పడితే మేం భయపడతున్నం. ఎట్ల కాపాడుకోవాలోనని ఆగమైతున్నం. ప్రభుత్వం దయ చూపాలె. తడిసిన ధాన్యాన్ని కొని రైతులను ఆదుకోవాలె.

**- బొమ్మిడి రాజం, రైతు, మాసాయిపేట్ (వెల్లుల్ల)**



కాళేశ్వరం వెళ్లే బస్సులో సీటు కోసం ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

## పుష్కరాలకు బస్సులేవి?

**మంథని బస్టాండ్‌లో ప్రయాణికుల ఇక్కట్లు**

మంథని, మే 21 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో నిర్వహిస్తున్న సరస్వతీ పుష్కరాలకు మంథని నుంచి బస్సులు కరువయ్యాయి. ప్రయాణికుల రద్దీకి సరిపడా లేకపోవడంతో బస్టాండ్‌లో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. మంథనితో పాటు చుట్టుపక్క గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గంటలపాటు నిరీక్షణ తర్వాత వచ్చిన ఒక్క బస్సులో సీటు కోసం తంటాలు పడుతున్నారు. కొంత మంది భక్తులు చేసేదేమీలేక గమ్యం చేరితే చాలు అన్నట్టు నిల్చొని ప్రయాణిస్తున్నారు. ఇంకొందరు అధికంగా డబ్బులు చెల్లించి ప్రైవేట్ వాహనాల్లో వెళ్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించాలని, మంథని బస్టాండ్ నుంచి కాళేశ్వరం పుష్కరాలకు సరిపడా బస్సులను నడిపించాలని భక్తులు కోరుతున్నారు.

## రైతులనే బలి చేస్తరా..?

**కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ధ్వజం**

గంగాధర, మే 21 : కాంగ్రెస్ పాలనలో అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారిందని.. రుణమాఫీ కాక, రైతు భరోసా రాక, సాగు సాగక ఇబ్బంది పడుతున్నారని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆవేదన చెందారు. ప్రభుత్వాన్ని నడపడానికి రేవంత్‌రెడ్డి సర్కారు రైతులను బలి చేస్తున్నదని ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ప్రణాళికా లేమితో ఈ యాసంగిలో రాష్ట్రవ్యాప్తంగా 56 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి సాగయిందని చెప్పారు. 137 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేసి, 70 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేయాలని నిర్ణయించి రైతులను నిండా ముంచారన్నారు. సన్నవడ్లకు ₹500 బోనస్ ఇస్తామని ఇవ్వకుండా మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. చొప్పదండి నియోజకవర్గంలో అకాల వర్షాలతో ధాన్యం తడిసి రైతులు నష్టపోయారని, తేమతో సంబంధం లేకుండా మద్దతు ధరకు ధాన్యం కొనాలని డిమాండ్ చేశారు. జీలుగ విత్తనాల ధరలను కాంగ్రెస్ ప్రభుత్వం రెండింతలు చేసిందని మండిపడ్డారు. విత్తనాలు, లిక్కర్ ధరలను పెంచి ప్రభుత్వాన్ని నడుపుతున్నామని విమర్శించారు.

## బయలుదేరిన బస్సులో భార్యను ఎక్కించేందుకు వెళ్తూ..



వొడ్నాల భూమేశ్ (ఫైల్)

**రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ లెక్చరర్ దుర్మరణం**

ధర్మపురి, మే 21 : బయలు దేరిన బస్సులో భార్యను ఎక్కించేందుకు బైక్‌పై వెళ్తున్న ఓ ప్రైవేట్ లెక్చరర్ అనుకోని రీతిలో ప్రాణాలు కోల్పోయాడు. ఎదురుగా వస్తున్న ఓ వాహనం ఢీకొని తీవ్రగాయాలు కాగా, దవాఖానకు తరలిస్తుండగా చనిపోయాడు. ధర్మపురి ఎస్ఐ ఉదయ్‌కుమార్ వివరాల ప్రకారం.. ధర్మపురికి చెందిన ఓ ప్రైవేట్ లెక్చరర్ వొడ్నాల భూమేశ్వర్(42) భార్య బిందు కరీంనగర్‌లోని ఓ కళాశాలలో టీటీసీ శిక్షణ తీసుకుంటున్నది. ప్రతి రోజూ ఆర్టీసీ బస్సులో వెళ్లొస్తున్నది. ఎప్పటిలాగే బుధవారం కూడా తన భార్యను బస్సు ఎక్కించడానికి బైక్‌పై భూమేశ్వర్ బస్టాండ్‌కు వెళ్లగా.. అప్పటికే జగిత్యాల వెళ్లే బస్సు బయలుదేరింది. మళ్లీ గంట వరకు బస్సు లేక పోవడంతో అదే బస్సులో ఎక్కించాలనే ఉద్దేశంతో ముందు ఉన్న బుద్దేశ్‌పల్లి స్టేజీ వద్దకు వెళ్లేందుకు బైక్‌పై బస్సు వెనకాల ఫాలో అయ్యాడు. అయితే, జగిత్యాల నుంచి ధర్మపురి వైపు వస్తున్న టాటా ఏస్ వాహనం కుడివైపు ఉన్న పెట్రోల్ బంక్ వైపు తిరుగుతున్న క్రమంలో ఎదురుగా వస్తున్న భూమేశ్వర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భూమేశ్వర్ తలకు తీవ్రగాయాలయ్యాయి. వెనకాల ఉన్న అతడి భార్య బిందు కుడికాలుకు గాయాలయ్యాయి. చికిత్స కోసం ఇద్దరినీ జగిత్యాల తరలించారు. భూమేశ్వర్ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. భూమేశ్వర్ ధర్మారంలో ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్నాడు. జీవశాస్త్రం అధ్యాపకుడిగా మంచి పేరు సంపాదించాడు. ఆయన మృతితో ధర్మపురి, ధర్మారం మండలాల్లో దిగ్భ్రాంతి నెలకొన్నది. బిందు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా భూమేశ్వర్‌కు ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు.